యూరియా..లేదయా!

- రైతు సేవా కేంద్రాలకు రాని యూరియా
- పంటలు సాగుకు ఇబ్బందులు
- నెల రోజులుగా రైతన్నల ఎదురుచూపు

రొంపిచెర్ల: మండలంలో యూరియా కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. రెండు నెలలుగా మండలంలో యూరియా కొరత ఉంటోంది. దీంతో రైతులు పంటలు సాగు చేయలేక పోతున్నారు. 15 రోజులుగా మండలంలో సుమారు 225 మిల్లీల వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం 50 హెక్టార్లలోనే వరి సాగు చేశారు. మరో 150 హెక్టార్లలో పంట సాగు కోసం రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

మార్కెట్‌లో కూడా ఎక్కడా యూరియా లభించకపోవడంతో పీలేరు, భాకరాపేట ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకున్నామని రైతులు తెలిపారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని మరికొన్ని మండలాల్లోనూ నెలకొంది. ఇక, రైతు సేవా కేంద్రాల్లో ఉద్యోగులను బదిలీ చేయడంతో ఇక్కడ పనిచేస్తున్న 8 మంది బదిలీ అయ్యారు. అయితే ఇక్కడికి కేవలం నలుగురు మాత్రమే బదిలీపై వచ్చారు. వచ్చిన వారికి కూడా ఇంకనూ ఎరువుల అమ్మకాలలావాదేవీలు నిర్వర్తించేందుకు అనుమతి ఇవ్వలేదు. 8 రైతు సేవా కేంద్రాలో 250 బస్తాల జిప్సం మాత్రమే ఉంది. ఇది కూడా విక్రయించేందుకు అధికారుల అనుమతి ఇవ్వలేదు. రొంపిచెర్లలోని ఒక ప్రైవేటు ఎరువుల దుకాణానికి ఒక లారీ యూరియా బుధవారం వచ్చింది. ఇది విషయం తెలుసుకున్న రైతులు గ్రామాల నుంచి పోలోమంటూ అక్కడికి పరుగులు తీశారు. ఒక లారీ యూరియా గంటల్లోనే అయిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.


రొంపిచెర్లలోని ఎరువుల దుకాణం వద్ద కిటకిటలాడుతున్న రైతులు


మండలంలో వరినాట్లు వేస్తున్న రైతులు

ప్రతిపాదనలు పంపాం



మండలంలోని రైతు సేవా కేంద్రాలకు సబ్సిడీ ఎరువుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మండలంలో ఇప్పటి వరకు 50 హెక్టార్లలో వరి సాగు చేశారు. మరో 100 హెక్టార్లలో పంట సాగు చేసే అవకాశం ఉంది. యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ ఉద్యోగులు బదిలీ చేయడం వలన మరికొంత ఆలస్యం అవుతోంది. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

–శ్రావణి, మండల వ్యవసాయాధికారిణి

క్లుప్తంగా

బకాయిలు చెల్లించరూ!


మాట్లాడుతున్న మధుబాల

పుంగనూరు: స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగులకు, కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్) పుంగనూరు తాలూకా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం టీ..తాగుదాం రండి కార్యక్రమాన్ని ఆసుపత్రిలో ఉద్యోగులు నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, ఆర్జిత సెలవుల బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మధుబాల, అధ్యక్షుడు నాగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీఏఓ

కుప్పం: మండలంలోని ఎరువుల దుకాణాల్లో బుధవారం డీఏఓ మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీలు చేశారు. అన్ని రకాలు స్టాక్ వివరాలు నమోదు చేయాలని, ఎరువుల అమ్మకాలు, స్టాక్ రిజిస్టార్‌లో అవకతవకలు జరిగితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్పీ, ఆర్డీఓ కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం


డీఎస్పీ, ఆర్డీఓ భవనాల నిర్మాణానికి కాంప్లెక్స్‌ను జేసీబీతో నేలమట్టం చేస్తున్న దృశ్యం

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో డీఎస్పీ, ఆర్డీఓ నూతన కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొత్తపేటలో నిరుపయోగంగా ఉన్న కోటి రూపాయల విలువైన కాంప్లెక్స్‌ను తొలగించి, దాని స్థానంలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు నిర్మించనున్నట్టు ఎమ్మెల్సీ శ్రీకాంత్ కంచర్ల తెలిపారు. ప్రస్తుతం డీఎస్పీ, ఆర్డీఓలకు స్వంత భవనం లేక ఇతర ప్రభుత్వ శాఖల భవనాల్లో కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు, రాజ్‌కుమార్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు

పార్కుకు ఆపరేషన్ సిందూర్ పేరు పెట్టాలి

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై సుమారు రూ.2 కోట్లతో నిర్మిస్తున్న పార్కుకు ఆపరేషన్ సిందూర్ పేరు పెట్టాలని కోరుతూ బుధవారం మాజీ సైనికులు, పట్టణ ప్రముఖులు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో సైనికుల త్యాగానికి గుర్తుగా ఈ పేరు పెట్టాలని కోరారు.

ప్రమాణ స్వీకారం చేసిన సింగిల్‌విండో కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

వి.కోట: సింగిల్‌విండో కార్యవర్గం రైతులకు అండగా నిలిచి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక సింగిల్ విండో కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం స్థానిక డీసీసీ బ్యాంకు ఆవరణలో నిర్వహించారు. కార్యవర్గంతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. వి.కోట సింగిల్‌విండో చైర్మన్‌గా నారాయణస్వామి, ముదరందొడ్డి సింగిల్ విండో చైర్మన్‌గా హరినాథ్ రెడ్డి, డైరెక్టర్లుగా రాధాకృష్ణ, చిన్నబ్బ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు సకాలంలో తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గజరాజుపై ద్రౌపదీదేవి విహారం

పుత్తూరు: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై అమ్మవారు విహరించారు. భక్తులు కర్పూరహారతులిచ్చి మొక్కులు చెల్లించారు. ఉదయం 6 గంటలకు మంచినీళ్ల గుంట నుంచి పోతురాజు ముందు నడవగా గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. గెరిగ జలాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నోటీస్ బోర్డు

- నేడు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'

సదుం: మండలంలో గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. ఉదయం 8.45 గంటలకు గొంగివారిపల్లె, 10 గంటలకు అమ్మగారిపల్లె, 11కు నడిగడ్డ, 12కు చెరుకువారిపల్లెలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అలాగే ఎంపీ మిథున్ రెడ్డి విడుదల కోసం బూరగమంద శాసనమ్మ ఆలయంలో ఉదయం 7 గంటలకు పూజలు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

55 మందికి ఉద్యోగాలు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 55 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ, సీ–డాస్ ఆధ్వర్యంలో 17 కంపెనీలతో కలసి జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ మేళాకు 126 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 55 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

మోసం.. బాబు నైజం

- సంక్షేమ పథకాల పేరిట దగా
- ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత
- 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమంలో చాటిచెప్పిన నాయకులు


క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సదుం: ఎన్నికల ముందు పలు పథకాలను ప్రకటించి, తాము అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి కంటే రెండింతలు సంక్షేమ ఫలాలు అందిస్తానని ప్రకటించిన చంద్రబాబు ప్రజలను నిలువునా దగా చేశారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని పాలమంద, కంభంవారిపల్లె, ఊటుపల్లె, తాటిగుంటపాలెం పంచాయతీల్లో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మాట ప్రకారం ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను సైతం ఏడాదిలోనే అమలు చేసిన ఘనత జగనన్నదైతే, ఇచ్చిన హామీలను ఏడాదైనా నెరవేర్చకపోవడం చంద్రబాబు నైజమని స్పష్టం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఇలా హామీలతో ప్రజలను వంచించడటం పరిపాటిగా మారిందని, మరోవైపు నెరవేర్చని హామీల గురించి వైఎస్సార్ సీపీ పదే పదే ప్రశ్నిస్తుండటం, కూటమి ప్రభుత్వంపై నానాటికీ ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోతుండడంతో అరకొరగా పథకాలు అమలు చేస్తున్నారని, పైగా లబ్ధిదారులకు భారీగా కోత పెడుతోందని దుయ్యబట్టారు. బాబు మోసాన్ని ప్రజలు సైతం గుర్తించారని, చంద్రబాబు మాటలను ఇక వారు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలని బలంగా కోరుకుంటున్నారని తెలియజేశారు. అనంతరం క్యూ ఆర్ కోడ్‌లను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలు అందక ఎంత మోసపోయామో ప్రజలు వీటితో గుర్తించవచ్చన్నారు. తొలుత ఆలయంలో పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, సర్పంచులు మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రెడ్డి దీప, ఎల్లప్ప, ఎంపీటీసీ స్వరూప, పుత్రాజు, నారాయణ రెడ్డి, గిరిధర్ రెడ్డి, సీతాపతి, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: మండలంలోని అడవిబూదుగూరు దళితవాడ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులు, ప్రహారీగోడ, మరమ్మతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన 64 లక్షల రూపాయలతో పనులను ప్రారంభించారు. బుధవారం ఎంఈఓ–2 రాజారాం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, దళితవాడ ప్రాథమిక పాఠశాలకు తరగతి గదులు చాలవని ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, స్థానిక నాయకులు సమస్యను నివేదించడంతో కడా ప్రాజెక్టు డైరెక్టర్ స్పందించి పాఠశాలకు రూ.64 లక్షలు కేటాయించారన్నారు. ఈ నిధులతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణమూర్తి, చిట్టిబాబు, గణేష్, బాలకృష్ణ, శరవణ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే ఎరువులు అమ్మాలి


కల్లూరులోని గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ లీలాకుమారి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను రైతులకు అమ్మాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి లీలాకుమారి స్పష్టం చేశారు. బుధవారం ఆమె కల్లూరులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతిషాపులో ఎరువుల స్టాకు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ఎరువులు కొన్న రైతులకు రసీదు తప్పక ఇవ్వాలన్నారు. వరి పైరుకు యూరియాను వాడాలని, కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో తమకు కావలసిన ఎరువులను రిజిస్టర్ చేసుకుంటే వారికి ఎరువుల దుకాణంలో ఇస్తామన్నారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని హితవు పలికారు. అవసరమైన ఎరువులు ప్రస్తుతం ఎరువుల దుకాణాలలో లభ్యమవుతున్నాయని, కావలసిన రైతులు వెళ్లి పొందవచ్చన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం


మంజునాథరెడ్డి

గంగవరం: మండల వైఎస్సార్ సీపీ కార్యవర్గాన్ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా మంజునాథరెడ్డి, శంకర, ప్రధాన కార్యదర్శులుగా మునస్వామి, మునిరాజ, మేఘనాథ్, పురుషోత్తం, కార్యదర్శులుగా గోపి, సలామ్, రమణప్ప, సురేంద్రరెడ్డి, అమరతో పాటు మరో 30మంది కార్యనిర్వాహక సభ్యులు నియామితులయ్యారు. పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

ఘనంగా తిరునాళ్ల


మారెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని అడవిచేనులో బుధవారం సత్యమ్మ, మరెమ్మ తిరునాళ్లను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఊరేగింపుగా వెళ్లి మహిళలు అంబలి పోశారు. సాయంత్రం అమ్మవార్ల వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. రాత్రి సత్యమ్మను గ్రామస్తులు పురవీధుల్లో ఊరేగించారు.

వరసిద్ధుని సేవలో సినీ నటి రమ్యకృష్ణ



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని బుధవారం సినీ నటి రమ్యకృష్ణ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. సిబ్బంది వాసు, బాలాజీ ఆమెకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రాష్ట్ర ఫుడ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ


భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న దేవి గంజిమల

పూతలపట్టు(యాదమరి): రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి గంజిమల పూతలపట్టు ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆమె మండలంలో పలు సంస్థల్లో తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. విద్యార్థులకు సరైన మోతాదులో ఆహారం పెట్టకపోవడం ఆమె గుర్తించారు. దీంతో వంట నిర్వాహకులు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులపై మండిపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. పిల్లలతో పాటు ఆమె కూడా భోజనం చేస్తూ కాసేపు ముచ్చటించారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలను, రేషన్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యూ నాగేశ్వరరావు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు


విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

పెద్దపంజాణి: మండలంలో శంకర్రాయలపేటలోని మహాత్మా జ్యోతిభా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) విద్యార్థినులకు బుధవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ అరిత అధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రాథమిక దశలోనే కంటిలోని సమస్యలను గుర్తించి అందుకు అవసరమైన చికిత్స చేయడానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు రహమత్ ఆలీఖాన్, పెద్దపంజాణి వైద్యాధికారి మురళి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంగా విరిగి పడిన చెట్టు కొమ్మ!

- తొలగించని అధికారులు
- మరో మార్గంలో వెళ్తున్న వాహనాలు



గంగవరం: మండలంలో కీలపట్లకు ఉన్న రోడ్డులో మంగళవారం రాత్రి వర్షానికి ఓ చెట్టు కొమ్మ విరిగి అడ్డంగా పడింది. ఇది ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నా సంబంధిత అధికారులు బుధవారం సాయంత్రమైనా తొలగించలేదు. ప్రసిద్ధ కోనేటిరాయ స్వామి ఆలయానికి ఈ రోడ్డు మార్గానే వెళ్లాలి. రోజూ వందలాది వాహనాలు వెళ్లే ఈ మార్గంలో కొమ్మ పడటం మూలాన ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. ఇతర వాహనాలు మరో మార్గంలో చుట్టుకుని వెళ్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై నుంచి కొమ్మను తొలగించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!

- ప్రమాదకరంగా మారిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్
- బైపాస్ కావడంతో మితిమిరిన వేగంతో వాహనాలు
- సర్కిల్‌గా మారినా కానరాని ట్రాఫిక్ నిబంధనలు


ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి ఎంట్రన్స్ ప్రాంతం

కుప్పం: పట్టణం బైపాస్ మార్గంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్ ప్రమాదకరంగా మారింది. పలమనేరు నుంచి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి వరకు బైపాస్ రోడ్డు కావడంతో మూడు రాష్ట్రాలకు రాకపోకలకు కూడలిగా ఉంది. అయితే వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండటం ప్రమాదాలకు తావిస్తోంది. బైపాస్‌లోని ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్ ప్రాంతం సర్కిల్‌గా మారడంతో తరచూ ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారుతోంది. పలమనేరు , క్రిష్ణగిరి, ఆర్టీసీ బస్టాండు, లింక్ రోడ్డు మార్గాలలను కలుపుతూ సర్కిల్‌గా మారడంతో ఇక్కడ వాహనాల రాకపోకలు నిత్యం అధికమయ్యాయి. ప్రధానంగా తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నుంచి వచ్చే వాహనాలు మితిమీరిన వేగంతో వస్తూండటం, ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్ వద్ద పల్లంగా ఉండడంతో వాహనాలను నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. బస్టాండు, పట్టణం లింక్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్ నుంచి బ్రిడ్జిపైకి వెళ్లాలంటేనే ఆందోళన చెందవలసిన పరిస్థితి కలుగుతోంది. తమిళనాడు నుంచి లోడుతో వచ్చే లారీలు ఎక్కడ అదుపు తప్పి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనచోదకులు భయం..భయంగా వెళ్లవలసి వస్తోంది.

అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలే..

ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్‌లో వద్ద వాహనాలు అప్రమత్తంగా వెళ్లకపోతే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే అవుతుంది. ఐదు రోజుల క్రితం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదమే దీనికి నిదర్శనం. ఆర్టీసీ బస్టాండు వైపు నుంచి ద్విచక్రవాహనంలో బ్రిడ్జిపైకి వెళుతుండగా మితిమీరిన వేగంతో క్రిష్ణగిరి వైపు నుంచి వస్తున్న లారీ వేగాన్ని కంట్రోల్ చేయలేక మోటార్ సైక్లిస్టులను ఢీకొంది. అలాగే అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిచి ఉన్న పాల డెయిరీ లారీని కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో 22 ఏళ్ల యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అంతేకాకుండా రోడ్డుపై నిలబడి ఉన్న ఇద్దరు మహిళలు అదృష్టవశాత్తు ఈ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. గతంలో కూడా సైకిల్ మీద వస్తున్న యువకుడిని ఓవర్ బ్రిడ్జి నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అతడు మృతి చెందాడు. మరో రెండు ప్రమాదాలతో నలుగురు తీవ్రంగా గాయపడి కోలుకున్నారు. ప్రమాదకరంగా మారిన ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు, వాహనాల వేగం నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఐదు రోజు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

ఇలా చేస్తే సరి

ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి ఎంట్రన్స్ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయడం, అలాగే సిగ్నల్ లైట్లు, ట్రాఫిక్ నిబంధనలు తెలిపేలా రేడియం స్టిక్కర్లు రోడ్డు ఇరువైపులా ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుంది. అలాగే ట్రాఫిక్ సిబ్బంది నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షంతో వేరుశనగ కళకళ


దిగువ మోదలపల్లెలో కురుస్తున్న వర్షం

తవణంపల్లె: మండలంలో మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు అదును సమయంలో వర్షాలు పడలేదు. దీంతో ఈ ఏడాది వేరుశనగ పంట సాగు తగ్గింది. అయితే మూడు రోజులుగా మండలంలో సాయంత్రం వేళ మేఘావృతమై వర్షం పడుతోంది. సోమవారం 4.8 మిల్లీమీటర్లు, మంగళవారం 1.2 మిల్లీమీటర్లు, బుధవారం 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాల వల్ల కుంటలకు, చెరువులకు నీరు చేరలేదు. వర్షాలతో భూమిలో తేమశాతం పెరగడంతో వేరుశనగ పంట, మామిడి చెట్లు కళకళలాడుతున్నాయి.